క్లుప్తంగా

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

పాములపాడు: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని వాడాల గ్రామంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. ఆర్‌సీఎం చర్చి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 23 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజులుగా జరుగుతున్న కబడ్డీ పోటీలు శనివారంతో ముగియనున్నాయన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



డీఎస్పీ రామాంజినాయక్ చేతులమీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఏపీ ఎన్‌జీఓ 2025 సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం డీఎస్పీ రామాంజినాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, కార్యదర్శి సాజిద్‌బాషా, ఉపాధ్యక్షులు ఫక్రుద్దీన్, సహాయ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు సుంకన్న పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



సంప్రదాయ నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై విజయవాడకు చెందిన రాఘవేంద్ర కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతిస్తుతి, శివతాండవం, అయిగిరినందిని, శివాష్టకం, ఆనందనర్తనం, ఓం నమఃశివాయ తదితర గీతాలకు, అష్టకాలకు అంజలి, వర్షిత, లహరి, దేవిప్రియ తదితరులు భక్తిగీతాలకు నృత్యాలు ప్రదర్శించారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి వేదోక్త పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం, ధ్వజస్తంభం వద్ద హారతి పూజలు చేశారు.

ఆలయ భూముల వద్ద మరోసారి సర్వే

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలోని పెద్దనంది ఎదురుగా ఉన్న దేవదాయశాఖ, రైతుల భూముల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. మహానంది గ్రామానికి చెందిన లీలావతి, మరికొందరు పొలం రస్తా కోసం దరఖాస్తు చేసుకోవడంతో తహసీల్దార్ రమాదేవి, ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సర్వే చేయించారు. కాగా దరఖాస్తుదారులెవరూ హాజరు కాలేదు. అయినా అధికారులు హడావుడి చేయడం పట్ల పలు విమర్శలు వినిపించాయి. ఆలయ ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ నాగభూపాల్‌రెడ్డి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 21 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 21 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రెండు కంపెనీల ప్రతినిధులు హాజరై 59 మంది నిరుద్యోగులను ఇంటర్వ్యూ నిర్వహించి 21 మందిని ఎంపిక చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారులు సుబ్బన్న, వెంకటరమణ, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడుయాదవ్

ఆత్మకూరు: సావిత్రీబాయి పూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని నియోజకవర్గ అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్‌తో కలిసి ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రీబాయిపూలే విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి, మహిళల చదువు కోసం ఎంతో కృషి చేశారన్నారు. భర్త జ్యోతిరావుపూలేతో కలిసి 1848 జనవరి 1న పూనేలో మొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. కుల, పితృస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. వారి అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు వీరన్న, పట్టణ అధ్యక్షులు శ్రీహరి, బీసీ నాయకులు పెద్ద నాగన్న, డాక్టర్ వెంకటేశ్వర్లు, పెద్దన్న, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సావిత్రీబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎస్‌ఓ యశోద, సీపీఐ నాయకుడు రమేష్‌బాబు పూల మాలలు వేసి, ఆమె సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

శ్రీశైలం డిగ్రీ డిగ్రీ కళాశాలలో..

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రాబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకులు డాక్టర్ ఎం.బుచ్చయ్య, డాక్టర్ ఎం.పద్మ, ఇందిరాప్రియదర్శిని, డాక్టర్ కె.రాజన్న, మహేశ్వరరెడ్డి, బాలు, పూర్ణేశ్వరరెడ్డి, నాగరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో రిటైర్డ్ మండల రీసోర్స్‌పర్సన్ మేరి లలితమ్మను ప్రిన్సిపాల్ కె.జవహర్ సన్మానించారు.





చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ధీర వనిత.. సావిత్రీబాయి పూలే

కొత్తపల్లి: సమాజంలోని సామాజిక రుగ్మతలకు ఎదురు నిలిచి పోరాడిన ధీర వనిత సావిత్రీబాయి పూలే అని, ఆమె ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్)జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సంపత్ కుమార్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సావిత్రీబాయికి ఏడేళ్ల వయస్సులో జ్యోతిరావు పూలేతో బాల్య వివాహమైందన్నారు. సంఘసంస్కర్త అయిన జ్యోతిరావు పూలే మహిళలకు విద్య నిషేధం ఉన్నప్పటికీ, తన భార్యకు చదువు నేర్పించి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారన్నారు. 1848లో అణిచివేతకు గురవుతున్న బాలికలకు పూణేలో పాఠశాలను ప్రారంభించి మొదట 9 మంది బాలికలకు సావిత్రీబాయి చదువు నేర్పించారన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మహిళల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. వితంతువులకు పునర్వివాహాలను ప్రోత్సహించిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ కర్ణాకర్, సలీం, వెలుగు సీసీలు రత్నకుమారి, మూర్తుజావలి, ఏపీఓ హరికృష్ణ, బీసీ సంఘం నాయకుడు కుక్కన్న, ప్రజా సంఘాల నాయకులు తెలుగు రమణయ్య, స్వాములు, వరప్రసాద్, పాదువు మహిళలు పాల్గొన్నారు.



శ్రీశైలంలో మేరి లలితమ్మను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

సావిత్రీబాయికి ఘన నివాళి



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేస్తున్న డాక్టర్ నాగన్న

పాములపాడు: దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జ్యోతీరావుపూలే అంబేడ్కర్ గ్రంథాలయంలో డాక్టర్ నాగన్న, ప్రజా సంఘాల నాయకులు ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగన్న మాట్లాడుతూ భారతీయ సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రీగా నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహిళ సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. అలాగే స్థానిక వివేకానంద విద్యావిహార్ హై స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులు సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలె వేసి నివాళులర్పించారు.

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శనీయం



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

వెలుగోడు: సాంఘిక దురాచారాలను ఎదిరించి, మహిళల విద్యాభివృద్ధికి జీవితాన్ని త్యాగం చేసిన సావిత్రీబాయి పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహకోశాధికారి కృష్ణార్జున రెడ్డి సూచించారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మంనాయక్‌తో కలిసి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మండలంలోని ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయినులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ హెగ్డే, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా మీడియా కార్యదర్శి సురేష్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, మండల నాయకులు లక్ష్మీనరసింహులు, నాగసుబ్బ, వెంకటేశ్వర్లు, దస్తగిరి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నిత్య చైతన్యమూర్తి సావిత్రీబాయి పూలే

నందికొట్కూరు: నిత్య చైతన్యమూర్తి సావిత్రీబాయి పూలే అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాల, ప్రజా సంఘాల నాయకులు సావిత్రీ బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని దామగట్ల గ్రామ పొలిమేరలో వ్యవసాయ కూలీలు సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంఘిక దురాచారాలను ఎదిరించి మురికివాడల్లో నివసించే పిల్లల విద్యాభివృద్ధికి సావిత్రీబాయిపూలే ఎంతో కృషి చేశారన్నారు. నిరక్షరాస్యురాలైన సావిత్రీబాయికి భర్త జ్యోతిరావుపూలే చదువు నేర్పించి మొదటి ఉపాధ్యాయినిని చేశారన్నారు. అనంతరం పూలే దంపతులు 52 పాఠశాలలను ప్రారంభించి ఎంతో మందికి ఉచితంగా విద్యనందించారన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి, డీబీఆర్‌సీ జిల్లా నాయకురాలు వేల్పుల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కూలీలు

తప్పులను సరిదిద్దాలి

బండి ఆత్మకూరు: కుల గణనలో దొర్లిన తప్పులను సరిదిద్దాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇటిక్యాల శివకుమార్ మాదిగ శుక్రవారం తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఎస్సీలలో ఉన్న 59 కులాలకు అదనంగా మాదాసి కురువ, మాదారి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చారన్నారు. ఎస్సీ హిందూ మాదిగ బదులు, ఎస్సీ క్రిష్టియన్ అని, మరికొన్ని చోట్ల మాదిగకు బదులు మాల అని నమోదు చేశారని ఆరోపించారు. మాల జాబితాలో లేని మోచ్చి, అరుంధతి కులస్తులను చేర్చారని మరోసారి విచారణ చేసి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. అలాగే నకిలీ ఎస్సీ సర్టిఫికెట్‌లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకటసుబ్బన్న, జిల్లా నాయకులు బంజల శ్రీనివాసులు, జాలె బాలస్వామి, మల్లెపూల గోవిందు, బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మల్యాలలో 'పొలంబడి'



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలిమేరలోని పొలంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు విజయశేఖర్, షేక్షావలి హాజరై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రబీ సీజన్‌లో వేసిన పంటలకు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. పొలం గట్ల చుట్టూ రక్షణ పంటగా జొన్న వేసుకోవాలన్నారు. ఆకర్షక పంటగా బంతి మొక్కలను ఎకరానికి 10 నుంచి 15 వరకు నాటుకోవాలన్నారు. లింగాకర్షక బుట్టలు ఎకరానికి 10 చొప్పున ఏర్పాటు చేసుకుని పురుగు ఉధృత్తిని తగ్గించుకోవాలన్నారు.

బోర్ల విద్యుత్ కోసం రైతన్నల ప్రదక్షిణలు

- పట్టించుకోని అధికారులు

జూపాడుబంగ్లా: వ్యవసాయ బోర్లకు విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండ్లెం, పారుమంచాల, తంగడంచ గ్రామాల రైతులు మోహన్‌కుమార్, శేషిరెడ్డి, నాగశేషులు, పుల్లయ్య తదితరులు ఆరోపించారు. శుక్రవారం రైతులు మాట్లాడుతూ పొలంలో బోరు తవ్వకొని రెండేళ్ల అవుతుందన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం తహసీల్దార్, భూగర్భజలవనరుల శాఖ, విద్యుత్‌శాఖ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ తెలుగులో ఇచ్చిన సర్టిఫికెట్ చెల్లదంటూ భూగర్భజల వనరుల శాఖ అధికారులు తిప్పి పంపారని, ఆంగ్లంలో తయారు చేయించుకుని తీసుకెళ్లిన సర్టిఫికెట్ తీసుకెళ్లగా తాము ఇచ్చిన మోడల్లోని సర్టిఫికెట్‌పైనే సంతకం చేయించుకుని రావాలని మరోసారి వెనక్కి పంపారన్నారు. ఇదే విషయమై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా రెండు సార్లు తిప్పి పంపారన్న కారణంతో తాము పొలాన్ని పరిశీలించి పొలంలో బోరు తవ్వుకున్నారా లేదా అనే విషయంపై మాత్రమే సర్టిఫికెట్ మంజూరు చేస్తామని ఆయన కూడా కొర్రీ వేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కనెక్షన్ ఇప్పించి తమ పైర్లను కాపాడాలని వారు కోరారు.



సమస్యను తహసీల్దార్‌ను విన్నవిస్తున్న రైతులు



పడిగాపులు

రేషన్ కోసం చౌకదుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

జగనన్న హయాంలో ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులను దర్జాగా తీసుకున్న వినియోగదారులకు కూటమి పాలనలో రేషన్ కష్టాలు మొదలయ్యాయి. ఎండీయూ వాహనాలను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం డీలర్ల చేతికే పంపిణీ పగ్గాలు అప్పగించడంతో వినియోగదారుల కష్టాలు వర్ణనాతీతం. చౌకదుకాణాల వద్ద గంటల తరబడి వయోవృద్ధులు, మహిళలు, వికలాంగులు క్యూలో నిరీక్షించి విసిగిపోతున్నారు. అందుకు సజీవ సాక్ష్యమే పగిడ్యాల కృపామందిరం కాలనీ ఏరియాలోని చౌకదుకాణం. చౌకదుకాణంలో పొందిన సరుకులను ఇంటికి తీసుకెళ్లడానికి వృద్ధులు, మోకాళ్ల నొప్పులున్న వారు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పగిడ్యాల

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

ఆత్మకూరు: కర్నూలు జిల్లా కేంద్రంలోని యాదవ హాస్టల్‌లో ఈనెల 12న నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులందరూ తరలిరావాలని యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు పోలకల్ నాగేశ్వరరావు, యనగండ్ల శ్రీనివాసులు, చెన్నుపాడు రామకృష్ణ, గుమ్మడాపురం శ్రీనివాసులు, నాగరాజు తదితరులు కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని యాదవ హాస్టల్‌లో తమతోపాటు దాదాపు 500 మంది విద్యార్థులు చదువుకుని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డామన్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు, ఒకరి బాగోగులు మరొకరు తెలుసుకునేందుకు యాదవ వసతిగృహంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలన్నారు. హాస్టల్‌లో ఉండి చదువుకున్న ప్రతి పూర్వపు విద్యార్థులతో పాటు హాస్టల్ అభివృద్ధి కోరే యాదవులు కూడా సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

మందుబాబుకు జైలు శిక్ష

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పార్నపల్లి గ్రామానికి చెందిన మందుబాబు నగేష్‌కు నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మద్యం తాగి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు యువకుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన మద్దిలేటి శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు... మద్దిలేటి కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

వెలుగోడు: సొసైటీ బ్యాంకులో అకౌంట్ ఉన్న రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పంట రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకు సేవలు అందుతాయన్నారు.

6న వికలాంగుల పింఛన్‌ల పరిశీలన

పగిడ్యాల: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6న మండలంలోని వికలాంగుల పింఛన్ లబ్ధిదారులను వెరిఫికేషన్ చేయనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ శుక్రవారం తెలిపారు. పింఛన్‌దారులకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేసేందుకు ఆర్థోపెడిక్ డాక్టర్, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్‌లతో కూడిన టీమ్‌ను నియమించినట్లు ఎంపీడీఓ తెలిపారు. వికలాంగుల పింఛన్ కింద పింఛన్ తీసుకుంటున్నా లబ్ధిదారులు అందుబాటులో ఉండి సదరం ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

పేదలకు గృహాలు నిర్మించి ఇవ్వాలి

పాములపాడు: నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. బానకచెర్ల గ్రామంలో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే విషయమై ఈనెల 10 న తహసీల్దార్‌కు వినతి పత్రాలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ తాలుకా కార్యదర్శి ప్రతాప్, నాయకులు ఏసేపు, లక్ష్మీపతి, సామేలు, కోటి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగ కానుక ప్రతి కార్మికునికి రూ.1,000 ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాల ఆర్థిక సాయం పెంచాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు, హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జయన్న, బాలరాజు, నాగన్న, సురేష్, దర్గయ్య, చిన్నలింగస్వామి, సుగుణమ్మ, మరియమ్మ, జీవరత్నమ్మ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం

పాములపాడు: రీ సర్వే వల్ల భూముల విస్తీర్ణంలో ఉన్న తేడాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. శుక్రవారం వాడాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వే చేపట్టిన భూముల్లో తేడాలున్నాయన్నారు. సర్వేయర్లు భూముల వద్దకు వెళ్లి కొలతలు వేయనున్నారన్నారు. ప్రతి రైతుకు ఎంత భూమి ఉందో నిర్ధారించి రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. అనంతరం మ్యుటేషన్‌కు సంబంధించి 2 అర్జీలు రైతుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖాజాబీ, సర్వేయర్ కలిముల్లా, వీఆర్వోలు మద్దిలేటి, పురంధరుడు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 12 వినతులు

మిడుతూరు: మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 12 వినతులు వచ్చినట్లు ఆర్ఐ జహంగీర్‌బాషా తెలిపారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉంటే వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

పగిడ్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం నాటితో ముగిశాయని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. చివరి రోజై సంకిరేణిపల్లెలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో నాలుగు అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, సర్వేయర్ జ్ఞానప్రకాష్, వీఆర్వో శేఖర్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాల తనిఖీ

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వేసిన రోడ్ల నిర్మాణాలను శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి తనిఖీ చేశారు. జగనన్న కాలనీలోని గ్రావెల్ రోడ్లను, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా నిర్మించిన మెయిన్‌రోడ్డులోని సీసీ రోడ్డు కొలతలు తీసుకుని నమోదు చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీ మనికంఠ, టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు కొలతలు వేస్తున్న దృశ్యం

వేతనాలు పెంచాలి

నందికొట్కూరు: మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు శుక్రవారం అల్లూరు గ్రామంలో మాండ్ర స్వగృహంలో ఎమ్మెల్యే జయసూర్యకు వినతిపత్రం అందజేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా దినసరి మున్సిపల్ కార్మికులకు వేతనం పెంచాలని, ప్రతి గురువారం దినసరి కూలీలకు సెలవు దినం ప్రకటించాలని కోరారు.

రీసర్వేపై రైతులకు అవగాహన

జూపాడుబంగ్లా: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగన్న తెలిపారు. శుక్రవారం 80 బన్నూరు గ్రామంలో రెండో విడత భూముల రీసర్వేపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. వీఆర్వోలు అల్లావుద్దీన్, చంద్రశేఖర్‌నాయుడు, సాయిబాబా, సర్వేయర్లు సుధాకర్, వసీంఅక్రమ్, ఇందిరా పాల్గొన్నారు.